




# దిగజారుతున్న వ్యవసాయ కూలీ బ్రతుకులు పట్టించుకోని పాలకులు



**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ

# దిగజారుతున్న వ్యవసాయ కూలీ బ్రతుకులు పట్టించుకోని పాలకులు

నేడు కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వాలు దళితులు, గిరిజనులు ఇతర పేదల చేతుల్లో వున్న భూమిని లాగేస్తున్నాయి. గతంలో పోరాడి సాధించుకున్న భూములు పోతుంటే వ్యవసాయ కార్మికులు ఆ భూములు దక్కించుకోవడానికి ఆందోళనచేస్తున్నారు. రాష్ట్రం అభివృద్ధి పేరుతో పేదల ఉపాధిని తీసివేసి వారి పొట్టలు గొడుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సిపియం పిలుపునిస్తున్నది. పరిశ్రమలకోసం భూమిని సేకరించదలిస్తే వారి ఆమోదం మేరకు భూసేకరణ చట్ట ప్రకారంగా నష్ట పరిహారం ఇచ్చి భూమిని తీసుకోవాలని గత యుపిఏ ప్రభుత్వం చెప్పింది. నేడు చంద్రబాబు ప్రభుత్వం భూసేకరణ చట్ట ప్రకారమే కాకుండా భూసమీకరణ (ల్యాండ్ పూలింగ్) పేరుతో భూములు తీసుకొని పేద రైతులకు, వ్యవసాయ కూలీలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నాడు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న పేదరైతులు, వ్యవసాయ కూలీలకు సిపియం పార్టీ అండగా వుంటుంది.

మనదేశంలో వ్యవసాయ కార్మికుల జీవన పరిస్థితులు రోజురోజుకు క్షీణిస్తున్నాయి. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకొని కష్ట పడినా పొట్ట నిండని పరిస్థితి మారలేదు. పాలకులు వ్యవసాయ కార్మికుల జీవన స్థితిగతులు మెరుగు పడడానికి సమగ్రమైన చర్యలు చేపట్టడంలేదు. ఎన్నో సంవత్సరాలుగా వ్యవసాయ కార్మికసంఘం, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) వ్యవసాయ కార్మికులకు సమగ్ర కార్మికచట్టం తీసుకురావాలని పోరాడుతున్నది. నాటి రాజ్యసభ సభ్యులు, అఖిలభారత సిపియం పార్టీ నాయకులు అయిన కామ్రేడ్ హరికిషన్‌సింగ్ సూర్జిత్ రాజ్యసభలో వ్యవసాయ కార్మిక సమగ్రమైన అనధికారి బిల్లును ప్రవేశపెట్టారు. వ్యవసాయ కూలీలపట్ల ఎన్నో

పథకాలు ప్రవేశపెడతామని చెప్పే పాలకులు ఈ బిల్లును చర్చించడానికే ముందుకు రాలేదు. ఆనాటి నుండి కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తూనే ఉంది.

మన రాష్ట్రంలో సి.పి.యంజ నాయకులు, నాటి ఎమ్మెల్యే కామ్రేడ్ పాటూరు రామయ్య కూడా మన శాసన సభలో రెండుసార్లు వ్యవసాయ కార్మికులకు సమగ్ర కార్మికచట్టం కోసం అనధికారిక బిల్లును ప్రవేశపెట్టారు. సిపియం శాసనసభ పక్షం పదే పదే డిమాండ్ చేయగా రాష్ట్ర ప్రభుత్వం ఈయన పోరును పడలేక అనివార్యంగా గవర్నర్‌కు సమర్పించింది. గవర్నర్‌కూడా ఈ బిల్లుపట్ల సానుకూలంగా స్పందించలేదు.

**మిగులు భూములు - తీరు తెన్నులు :** వ్యవసాయ కార్మికుల బ్రతుకులు బాగుపడాలంటే వారికి స్వంతభూమి ఉండాలి. మనదేశంలో అనేక రాష్ట్రాల్లో వ్యవసాయ కూలీలు, పేద రైతులు పోరాటాల ద్వార లక్షలాది ఎకరాల భూమి స్వాధీనం చేసుకొన్నారు. మనరాష్ట్రంలో మార్క్సిస్టు పార్టీ, వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో అనేక కూలి పోరాటాలు జరిగాయి, జరుగుతున్నాయి. రాష్ట్రంలో వేలాది ఎకరాలు పేదలు స్వాధీనం చేసుకొని సాగుచేయడం జరుగుతున్నది. స్వాతంత్ర్యానంతరం కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ సంస్కరణలు ప్రవేశపెట్టి వ్యవసాయ కార్మికులకు మిగులు భూములు పంచుతామని నాటి నెహ్రూ ప్రభుత్వం 1953లో మహాలనోబిస్ కమిటీని వేసింది. ఈ కమిటి దేశవ్యాపితంగా పర్యటించి దాదాపు 6 కోట్ల ఎకరాలకు పైగా మిగులు భూమి వుందని అది పేదలకు పంచవచ్చని సూచించింది. ప్రకటనలు చేసిన నెహ్రూ ప్రభుత్వం భూపంపిణీ చేపట్టలేదు. ఇందిరా గాంధీ 1971లో గరీబి హటావో నినాదాన్నిచ్చింది. వ్యవసాయ కార్మిక పేదలకు, దళితులకు మిగులు భూములు పంచుతానని పదే పదే ప్రకటనలు చేసింది. భూ సంస్కరణల చట్టాన్ని అమలు చేస్తానని చెప్పింది. మరల మిగులు భూమి లెక్కల సేకరించగా కేవలం 4కోట్ల ఎకరాలు మాత్రమే వుందని తేలింది. కానీ జరిగిన భూపంపిణీ నామమాత్రం. 1978లో జనతాపార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు మరలా లెక్కలు తీయగా కేవలం 80లక్షల ఎకరాలు మిగులు భూమి మాత్రమే వుందని తేల్చారు. స్వాతంత్ర్యానంతరం మొత్తం పంచిన భూమి 45లక్షల ఎకరాలు కాగా ఒక్క పశ్చిమబెంగాల్‌లోనే సిపియం నాయకత్వంలో వామపక్ష ప్రభుత్వం 12లక్షల ఎకరాలు పేదలకు, దళితులకు పంచిది. వామపక్ష ప్రభుత్వాల పాలనలో వున్న బెంగాల్, కేరళ,

త్రిపుర రాష్ట్రాలు మినహా మరే రాష్ట్రం చిత్తశుద్ధితో భూసంస్కరణలు అమలుచేయలేదని గత యుపిఏ ప్రభుత్వం తయారు చేసిన భూసీలింగ్ ముసాయిదా బిల్లులో చెప్పింది.

**భూసంస్కరణ చట్టం అమలు తీరు :** దేశవ్యాపితంగా భూ సంస్కరణల చట్టంవల్ల భూస్వాములు బాగా లాభపడ్డారు. సొంత సాగు పేరుతో లక్షలాదిగా కౌలుదార్లను భూమినుండి గెంటివేశారు. భూస్వాములు అనేక అక్రమ మార్గాలద్వారా భూములను దాచుకోవడానికి చట్టం వీలు కల్పించింది. ఇక భూమిని దాయలేని పరిస్థితిలో సాగుకు పనికిరాని కొండలను, గుట్టలను పనికిరాని బీడు భూములను ప్రభుత్వానికి అప్పగించారు. భూసంస్కరణల చట్టం అమలువల్ల భూస్వాములు వారివద్దవున్న భూములను అమ్ముకోగలిగారు.

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ సంస్కరణల లక్ష్యం దేశంలో భూమిలేని వ్యవసాయ కార్మిక, పేద రైతులకు భూమిని పంపిణీ చేయడం కాదు. భూస్వాములను పెట్టుబడిదారీ భూస్వాములుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ కర్తవ్యాన్ని కేంద్రప్రభుత్వాలు జయప్రదంగా అమలు జరిపాయి.

మన రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులు భూసంస్కరణల చట్టాన్ని పకడ్బంధీగా అమలు చేస్తామని ప్రగల్భాలు పలికారు తప్ప భూ పంపిణీ సక్రమంగా చేయలేదు. మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, రాజీవ్‌గాంధీ మరణానంతరం ప్రధానమంత్రిగా పనిచేసిన శ్రీ.పి.వి.నర్సింహారావు తన 5ఏళ్ల పదవి కాలంలో మిగులు భూములు పంచాలని పదే పదే చెప్పారు. కానీ ఆశ్చర్యమేమిటంటే ఆయన వద్దే వందలాది ఎకరాల మిగులు భూమి వుంది. ఆ భూమిని పంచకుండానే భూ పంపిణీ చేయమని చిలకపలుకులు వల్లించారు. పెట్టుబడిదారీదేశ భూస్వామ్య ప్రభుత్వం భూ పంపిణీ చేస్తుందని ఆశించడం అత్యాశే.త కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం సాగుభూమిలో 1% మాత్రమే మిగులు భూమిగా పేదలకు పంరాంటే భూ సంస్కరణల చట్టం అమలు ఎంత బూటకంగా జరిగిందో విదితమౌతున్నది.

మన రాష్ట్రంలో శ్రీ ఎన్.టి.ఆర్.నాయకత్వాన తెలుగుదేశం పార్టీ. రాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ఈ గాలి, భూమి, నీరు దేవుడిచ్చిన వరాలనరు. ఈ భూమిని పేదలకు పంచేస్తాను. నీటి పన్ను లేకుండా రద్దుచేస్తాననే. జనాకర్షక పథకాలతో గద్దెనెక్కారు.

పథకాలనైతే ప్రవేశపెట్టారు. తప్ప భూ పంపిణీ జరగలేదు. సిపియం పార్టీ నాయకత్వం రాష్ట్ర వ్యాపితంగా మిగులు భూముల వివరాలు అందజేసినా కేంద్ర, రాష్ట్ర పాలకులెవరైనా, ఏ పార్టీ అయినా భూములు పంచుతామని భ్రమ పెట్టారే తప్ప భూ పంపిణీ చేయలేదు. ఇదీ మన పాలకుల తీరు. భూముల్లో జెండాలు పాతినా ఉష్ణ పక్షుల్లాగ మిగులు భూములు ఎక్కుదున్నాయని చంద్రబాబుగారు సెలవిస్తున్నాడు.

స్వాతంత్ర్యం అనంతరం భూసంబంధాల్లో గణనీయమైన మార్పులొచ్చినా గుణాత్మకమైన మార్పులు రాలేదు. ఈనాం ఎస్టేట్స్ రద్దువల్ల ఆ భూములు సాగుచేస్తున్న భూస్వాములే ఆ భూములను తమ పేర రాయించుకొని లాభపడ్డారు. రాష్ట్రంలో 16,64,000 ఎకరాలు మిగులు భూమి వుందని నికరంగా తేలినా కోర్టు లిటికేషన్ల ద్వారా కొంత భూమిని, మేజర్ కొడుకు వాటా పేరుతో కొంత భూమిని, తెల్లకాగితాలమీద అమ్మకాలు, కొనుగోలు తదితర రూపాల్లో మొత్తంగా 11లక్షల ఎకరాలు భూమి భూస్వాము చేయి దాటలేదు. ఇది చెల్లదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా దానికనుగుణంగా చట్టంలో సవరణలు రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం 5లక్షల ఎకరాలు పంచామని చెప్పుకుంటున్నా అందులో సాగుకు పనికిరాని భూమే ఎక్కువ. కొంతమంది భూమిలేని వ్యవసాయ కూలీలకు భూ పంపిణీ పేరుతో పట్టాలు ఇచ్చినా వారికి భూమిని అప్పగించలేదు. భూపంపిణీని గత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక తంతుగా నడిపింది. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వున్న కాలంలో మూడు సార్లు భూపంపిణీ కార్యక్రమాన్ని ఆర్భాటంగా నిర్వహించారు. మిగులు భూములు లక్షలాది ఎకరాలు పంచుతామని ప్రకటన చేశారు. కానీ నాడు ఎంతో కాలంగా వ్యవసాయ కార్మికులు, పేదలు, గిరిజనుల ఆక్రమణలో వున్న భూములకు పట్టాలు మాత్రమే ఇచ్చారు. తప్ప భూస్వాముల ఆధీనంలో వున్న భూములను మాత్రం పేదలకు పంచలేదు. పేదలకు పంచిన ఎస్సైన్డ్ భూమి ఏ కారణం వల్లనైనా భూస్వాముల చేతుల్లోనే ఉంటే ఆ భూమిని పేదలకే అప్పగించాలని 9/77చట్టం చెబుతున్నది. కానీ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 9/77 చట్టాన్ని సవరించి ఎస్సైన్డ్ భూమిని ఎవరైనా కొనుగోలు చేస్తే ప్రభుత్వం నిర్ణయించిన ఫీజును సదరు వ్యక్తి చెల్లిస్తే అతనికే ఆ భూమి దక్కే విధంగా చట్టాన్ని మార్పుచేసి వ్యవసాయ కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేశారు. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే వ్యవసాయ కార్మికసంఘం, సిపియం వామపక్షాలు పోరాడిన ఫలితంగా కోనేరు రంగారావు కమిటీని నియమించారు.

ఈ కమిటీ వివిధ రకాల భూములను పరిశీలించి ఈ రాష్ట్రంలో భూమిలేని ప్రతి కుటుంబానికి 2ఎకరాల భూమి పంచడానికి తగిన భూమి వుందని తేల్చింది. కమిటీ సిఫార్సులు కూడా అమలుచేయలేదు.

**నేటికీ కొనసాగుతున్న భూకేంద్రీకరణ :** రాష్ట్రంలో భూకేంద్రీకరణ నేటికీ కొనసాగుతోంది. ప్రభుత్వ రెక్కల ప్రకారం గ్రామీణ జనాభాలో 70%మందికి సెంట్ భూమి లేదు. భూమిలేనివారి సంఖ్య రోజురోజుకి పెరుగుతున్నది. భూమిని కలిగినవారిలో కూడా 60%మందికి రెండున్నర ఎకరాలలోపే భూమి వున్నది. వీరివద్ద వున్న భూమి మొత్తం భూమి 16%మాత్రమే. నూటికి 4శాతం వున్న భూస్వాముల చేతుల్లో నేటికి 40% భూమి కేంద్రీకరించబడి వుంది. 62% మంది అట్టడుగువర్గాల పేదల చేతుల్లో మొత్తం భూమి కేవలం 17% మాత్రమే. దీన్ని బట్టి పరిశీలిస్తే అతి కొద్దిమంది చేతుల్లోనే భూ కేంద్రీకరణ కొనసాగుతున్నది. ఎన్ని పథకాలు వచ్చినా, భూపంపిణీ చేశామని ఎన్ని గొప్పలు చెప్పినా భూ కేంద్రీకరణ తగ్గలేదని పైగా పేదల చేతుల్లో వున్న భూమి కూడా భూస్వాముల చేతుల్లోకి పోతున్నదని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి.

**పేదరికం :** మనదేశంలో పేదరికం నిరంతరం పెరుగుతూనే వున్నది. పేరుకు ఎన్ని పథకాలు ప్రవేశపెట్టినా పేదలకు ఒనగూడిన ప్రయోజనం నామమాత్రమే. కేంద్ర ప్రభుత్వం నియమించిన అర్జున్‌సేన్ గుప్తా కమిటీ నివేదిక ప్రకారం దేశంలో అత్యధిక ప్రజానీకం రోజుకి రూ.20లు మించి ఖర్చు చేయలేకపోతున్నారని. వ్యవసాయ రంగంలో రోజురోజుకి పనిదినాలు తగ్గిపోతున్నాయంది. 1990నాటికి వ్యవసాయ రంగంలో సంవత్సరానికి 120 పనిదినాలుండేవి 2000సం॥ 100 పనిదినాలుకు తగ్గాయి. నేడు కేవలం సంవత్సరంలో 50-60రోజులు మాత్రమే పని దొరుకుతుందని అనేక సర్వేలు చెబుతున్నాయి. మన రాష్ట్రంలో 1కోటి 10లక్షలమంది వ్యవసాయ కార్మికులున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 92లక్షల కుటుంబాలుండగా 55లక్షల కుటుంబాలు 59% స్వంత భూమిలేక కేవలం రెక్కల కష్టం మీదే ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామీణ వ్యవసాయ కార్మికులు సొంత ఊరిలో పనిలేక పొట్టచేతపట్టుకొని ఇతర ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారు. పని దొరకక బిక్షాటన చేసుకుంటూ బ్రతికే స్థితి దాపురించింది. ఈ వలసలను అరికట్టాలంటే ప్రభుత్వం శ్రమ చేయగలిగిన వారికి ఉ పాధి అవకాశాలు కల్పించాలి. గ్రామీణ ప్రాంతంలో ఉపాధికి మార్గం భూపంపిణీనే

మార్గం. మన పాలకులు భూ పంపిణీ చేయరు. కావున వ్యవసాయ కార్మికులే సంఘటితంగా భూ పోరాటాలకు సిద్ధపడాలి.

చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికలముందు అనేక వాగ్దానాలు చేసింది. ఆ వాగ్దానాలను అమలు చేయమని వ్యవసాయ కార్మికులు, పేదరైతులు, కౌలుదార్లు, చేతివృత్తిదార్లు పోరాడుతూ వుంటే సమస్యల పరిష్కారానికి ప్రయత్నించకుండా పోరాడుతున్న ప్రజలపై పోలీసులను ఉసిగొల్పి నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది.

**పేదల భూములు బడా పెట్టుబడిదార్లకు :** రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధి పేరుతో లక్షలాది ఎకరాలు పేదలు సాగుచేసుకొంటున్న ఎస్సైన్డ్ భూములను, డీ పట్టా భూములను వారిచేతినుండి నిరంకుశత్వంగా లాగేసుకుంటుంది. గతంలో మిగులు భూములు, బంజరు భూములు పేదలకు పంచుతామని ప్రకటనలు చేసేవారు. “నా చివరి రక్తపు బొట్టు వరకు పేదల అభివృద్ధికోసమే వెచ్చిస్తానని” చెప్పిన ఈ పెద్దమనిషి చంద్రబాబు తిరుపతి మీటింగులో భూములు పంచేది లేదని పేదలు సాగుచేసుకుంటున్న ఎస్సైన్డ్ భూములు ప్రభుత్వానికే చెందుతాయని కావున ఆ భూముల్ని మేము తీసుకుంటామని నిసిగుగా ప్రకటించారు. ప్రకటన చేసిందే తడువుగా అనేక జిల్లాల్లో భూములను లాగేస్తున్నారు. ఒక్కొక్క జిల్లాలో లక్ష ఎకరాల చొప్పున భూబ్యాంక్‌ని ఏర్పాటుచేసి బడా పెట్టుబడిదార్లక కారుచౌకగా కట్టబెట్టడానికి ప్రభుత్వం పూనుకుంటుంది. భూసంస్కరణలు అమలు చేయకపోగా రివర్స్ సంస్కరణలు ప్రారంభించి పేదల చేతులనుండి భూమిని లాగేసి పెద్దలకు కట్టబెడుతున్నారు. ఇదే నా బాబు గారి పేదల ఉద్ధరణ?

రాజధాని నిర్మాణంకోసం తుళ్ళూరు ప్రాంతంలో 50వేల ఎకరాలు భూసేకరణ చేపట్టి రైతుల బ్రతుకులను బుగ్గిపాలు చేస్తున్నాడు. ఆ ప్రాంతంలో ఎస్సైన్డ్ భూములు, డీపట్టా భూములకు నష్టపరిహారం ఇవ్వకుండా వ్యవసాయ కూలీలను వేధిస్తున్నాడు. భూములు సాగులో లేకపోతే వ్యవసాయ కూలీలకు పని దొరకదు కాబట్టి సంవత్సరానికి 350రోజులు ఉపాధిపని ఇస్తామని ప్రకటన చేసారు తప్ప అమలు చేయడంలేదు. కృష్ణా జిల్లాలో లక్షా 60వేల ఎకరాలకు పైగా రిజర్వు ఫారెస్టు భూములను డీ ఫారెస్టు భూములుగా మార్చి ఆ భూమిని ప్రభుత్వం తీసుకొని పెట్టుబడిదార్లకు, స్వాములకు,

యోగా గురువులకు ఉచితంగా, కట్టబెట్టడానికి ప్రయత్నం చేస్తున్నాడు. గతంలో పంచినా, పంచకపోయినా భూములు పంచుతామనే మాట చెప్పేవారు ఇప్పుడు ఆ ముసుగు తీసేసి బహిరంగంగా బడా పెట్టుబడిదార్లకు భూములిస్తామని చెప్తున్నారు. మనదేశ పెట్టుబడిదార్లకే కాదు బహుళజాతి కంపెనీలైన సింగపూర్, జపాన్ కార్పొరేట్ దార్లకు ఎర్ర తివాచి  పరిచి ఆహ్వానం పలికి అత్తగారి సొమ్ము అల్లుడు దానం చేసినట్లు భూములు కట్టబెట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు.

**ఉపాధి చట్టం ఉసురు తీస్తున్న బి.జె.పి,తెలుగుదేశం ప్రభుత్వాలు :** స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో సిపియం వామపక్ష పార్టీల కృషి ఫలితంగా గ్రామీణ పేదలకోసం వచ్చిన అతికొద్ది చట్టాలలో ఉపాధిహామీ చట్టం ఒకటి. ఈ చట్టం బాగా అమలు జరిగినచోట పేదల జీవితాలలో కొంత మార్పు వచ్చింది.వలసలు తగ్గాయి. పేదలకొనుగోలు శక్తి పెరిగింది. వ్యవసాయ రంగంలో కనీస కూలీ రేట్లు పెరగడానికి దోహదపడింది. సన్న, చిన్న కారు రైతుల భూముల అభివృద్ధి చేయడానికి తోడ్పడింది.చదువుకున్న యువతీయువకులకు అనేక వేల మందికి ఉద్యోగ అవకాశాలు దొరికాయి. స్త్రీ, పురుషులు తేడాలేకుండా సమానకూలీ అందిస్తున్నది. ఈ పథకంలోనే కొంతైనా మహిళా సాధికారతకు వీలేర్పడింది. ఇంతటి ప్రయోజనం చేకూర్చిన గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని గొంతునులమడానికి బి.జె.పి, తెలుగుదేశం ప్రభుత్వాలు పూనుకొన్నాయి.

దేశంలో 18 కోట్ల మందికి పైగా వ్యవసాయ కార్మికులుంటే మన రాష్ట్రంలో 1కోటి 10 లక్షల మంది ఉన్నారు. వీరికి సొంత భూమిలేక కేవలం రెక్కల కష్టం మీద ఆధారపడి జీవిస్తున్నారు. మన రాష్ట్రంలో కరువు వల్ల వ్యవసాయ రంగం దెబ్బతినడం మరో పక్క డేల్టా ప్రాంతంలో ఉన్న వ్యవసాయ పనుల్లో యంత్రాల ప్రవేశం వల్ల కూలీలకు పనులు లేవు. ప్రతీ యేటా రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాల నుండి లక్షలాది మంది పేదలు వలసలు పోతున్నారు. పోయిన చోట సరైన భద్రత లేక యేటా వందలాది మంది ప్రమాదాల్లో చనిపోతున్నారు. వలసలు పోయిన సందర్భంగా వీరి పిల్లల చదువులు ఆగిపోయి జీవితాలు నాశనం అవుతున్నాయి. ఇంటి దగ్గరున్న వృద్ధులకు తిండిలేక భిక్షాటన చేసుకుంటున్న ఘటనలు అనేకం. ఇంతటి దౌర్భాగ్య పరిస్థితుల్లో ఉన్న గ్రామీణ పేదలకు ఉన్న ఊర్లో మరిన్ని పనిదినాలు పెంచి ఉపాధిహామీ చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేయాల్సింది పోయి చట్టాన్నే ఎత్తి వేయడానికి బి.జె.పి,

తెలుగుదేశం ప్రభుత్వాలు పూనుకోవడం దుర్మార్గం. ఈ చర్యను సిపియం తీవ్రంగా ఖండిస్తున్నది.

ఒకే సారి చట్టాన్ని తీసేస్తే పేదలనుండి ప్రతిఘటన ఎదురవుతుందని గమనించిన ప్రభుత్వాలు ఈ చట్టంలో ఉన్న లొసుగులను భూతద్దంలో చూపించి మంచి కుక్కను చంపడానికి పిచ్చికుక్క ముద్రవేసినట్లు ఈ పథకంపై విషప్రచారం చేస్తున్నారు. దీనికి కేటాయించిన నిధులన్నీ వృధా అవుతున్నాయని, ఎటువంటి ఆస్తులు ఒనగూరలేదని, కూలీలు సోమరి పోతులౌవుతున్నారని, దీని కారణంగానే వ్యవసాయ రంగం దివాళా తీస్తుందని పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేస్తున్నారు. కాబట్టి ఈ పథకాన్ని కుదించాలి. లేదా వ్యవసాయానికి అనుసంధానం చేయాలని తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. దేశంలో అందరి అభివృద్ధి అని చెబుతున్న మోది, స్వర్ణాంధ్రప్రదేశ్ అని ఊదరగొడుతున్న చంద్రబాబు పెట్టుబడిదార్లకు, కార్పోరేట్లకు వేల కోట్ల రూపాయలు రాయతీలు ఇస్తున్నారు. లక్షల ఎకరాల భూమిని కట్టబెడుతున్నారు. కోట్లాది మంది పేదకు పట్టెడన్నం పెడుతున్న ఉపాధిహామీకి నిధులు ఇవ్వకుండా ఆపివేస్తున్నారు. చట్టం ప్రారంభంలో యేటా బడ్జెట్‌లో 40వేల కోట్ల రూపాయలు కేటాయింపులు చేస్తే నేటి బి.జె.పి ప్రభుత్వం 31 వేలకోట్ల రూపాయలకు కుదించింది. 500 కోట్లు పెంచి భారీగా పెంచామని ప్రభుత్వాలు చంకలు గుద్దుకుంటున్నాయి. 2006 లో ఉపాధిలో ఇచ్చిన కూలి 80 రూపాయలు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నేడు ఉపాధిలో పెంచిన కూలి 180 రూపాయలు. ఈ లెక్క ప్రకారం బడ్జెట్‌లో 82 వేల కోట్లకు పెరగాలి. కాని ఉన్న బడ్జెట్ కేటాయించాలి. మరోప్రక్క ప్రజల భాగస్వామ్య ప్రణాళిక పేరుతో రాష్ట్రంలో 146 మండలాలకే చట్టాన్ని పరిమితం చేయాలని జిఓ తెచ్చారు. డిల్లీలో త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్‌తో పాటు దేశ వ్యాపితంగా సిపియం పోరాటం చేయడం వల్ల కొంత వెనక్కి తగ్గినటుంది. నైపుణ్యం పేరుతో లక్షలాది మంది జాబు కార్డులు రద్దు చేయడానికి పూనుకొన్నారు. గతంలో 60% పనులు కూలీలతో చేయిస్తే నేడు యంత్రాలతో చేయడానికి జిఓ ఇచ్చింది. పర్యవసానంగా ఉన్న ఉపాధి క్రమంగా తగ్గుతూంది.

రాష్ట్రంలో గతంతో పోల్చుకుంటే భారీగా నిధులు తగ్గించారు. 60 లక్షల మంది పని చేస్తే నేడు 24 లక్షల మందికి మించి పని చూపడం లేదు. పని కావాలని అధికారుల చుట్టూ తిరిగినా పనులు ఇవ్వరు. చేసిన పనికి నెలల తరబడి బకాయిలు చెల్లించడంలేదు.

చేతులు బొబ్బలు కట్టేలా పని చేసినా 80-90 రూపాయలకు మించి కూలిరాదు. స్మార్ట్ కార్డులని, ఆధార్‌కార్డులకు లింకు పేరుతో చేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించకుండా సస్పెన్స్ అకౌంట్ పేరుతో పేదలకు అనేక ఇబ్బందులు కల్గిస్తున్నారు. పేదలే ఈ పని పట్ల విరక్తి కలిగేటట్లు ప్రభుత్వాలు కుట్ర చేస్తూన్నాయి. గతంలో కుటుంబానికి సగటున 55 రోజులు పని చూపితే నేడు 40 రోజులకు మించి పని దొరకడంలేదు. ఇక 100 రోజులు చేసిన కుటుంబాలు కేవలం 3.50 లక్షలు మాత్రమే. కొత్తగా రాజధాని ప్రకటించిన అమరావతి ప్రాంతంలో ఏడాది పొడువునా 360 రోజులు ఉపాధి పనులు ఇస్తామని చెప్పిన చంద్రబాబు నేడు కూలీలను నట్టేట ముంచాడు. వ్యవసాయపనులు లేక ఉపాధి పనులు కల్పించక అనేక అగచాట్లు పడుతున్నారు.

**వ్యవసాయానికి అనుసంధానం :** పేదల కోసం వచ్చిన ఉపాధి చట్టాన్ని భూస్వాములకు కట్టబెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారు. వారి పొలాల్లో కూలీలు పనిచేసి ప్రభుత్వం దగ్గర డబ్బులు పొందాలి. భూస్వాములు కూలీలతో కాకుండా యంత్రాలతో పని చేయించుకుంటే యంత్రాల యజమానులకు ఉపాధి నిధులు చెల్లిస్తారు. ఈ పద్ధతి అమలు చేయాలని చంద్రబాబు ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానమే చేసింది. ఇది జరగలేదు కాబట్టి నీరు, చెట్టు పేరుతో కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారు. గతంలో పనికి ఆహారపథంకంలాగా నేడు ఉపాధినిధులన్నీ చెరువుల పూడిక పేరుతో యంత్రాలను వినియోగించి పేదల కడుపుగొట్టి కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారు. ఉపాధిలో యంత్రాలను ఉపయోగించరాదని చట్టం చెబుతే దాన్ని మార్చి యంత్రాలను ఉపయోగించవచ్చని కాంట్రాక్టర్లు దోచుకోవడానికి లైసెన్సు ఇచ్చారు.

ఉపాధిహామీని అమలు చేయడం ప్రభుత్వాలకు ఇష్టం లేకపోయినా, అరకొరగా అమలు చేసినా దీని ఫలితాలు కొంతవరకైనా పేదలకు అందాయి. గత 8 సంవత్సరాలలో 15,191 కోట్ల రూపాయలు ఉపాధికల్పన ద్వారా పేదల చేతికొచ్చింది. ఇందులో సగం డబ్బులు చేరాయనుకున్నా ఇంత పెద్దఎత్తున నేరుగా పేదలకు డబ్బులు అందడం ఈ పథకంలోనే. అన్ని దేశాలు ఆర్థిక సంక్షోభంలో పడి ఉపాధిపోతుంటే మన దేశం సంక్షోభంలోకి పూర్తిగా కూరుకుపోయి పనులు పోకుండా నిబెట్టింది. ఉపాధిహామీ పథకం ఒక కారణమని అనేక మంది ఆర్థికవేత్తలు, రిజర్వ్‌బ్యాంకు గవర్నర్, చివరకు ప్రపంచబ్యాంకు సైతం అంగీకరించక తప్పలేదు. ఇంతటి ప్రాధాన్యత కలిగి దేశంలో

కోట్లాది మంది పేదలకు అన్నం పెడుతున్నదీ పథకం. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం జిల్లాల్లో సన్న, చిన్నకారు రైతులు సహితం ఈ చట్టంపై ఆధారపడి బతుకుతున్నారంటే ఉపాధి పథకం యొక్క ప్రాధాన్యత ఎంత ఉందో అర్థమవుతుంది.

కాబట్టి అనేక పోరాటాలతో ఈ చట్టాన్ని సాధించకున్నాం. దీని గొంతు నులమడానికి బి.జె.పి, తెలుగుదేశం ప్రభుత్వాలు పూనుకున్నాయి. దీనిని మనం కాపాడుకోవాలి. దీని అమలుకోసం పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలి. కుటుంబానికి 200 రోజులపని, 300 రూపాయల వేతనం డిమాండ్ చేయాలని సిపియం వ్యవసాయ కార్మికులను కోరుతున్నది.

**ఇండ్ల స్థలాలు :** రాష్ట్రంలో సుమారు 9 లక్షల గ్రామీణ పేద కుటుంబాలకు ఇండ్ల స్థలాలు లేవు. పట్టణాల్లో మరింత ధుర్భరంగా వుంది. ఒకే ఇంటిలో రెండేసి కుటుంబాలు కాపురం వుంటున్నాయి. ఇళ్ళ స్థలాలు, సాగుభూముల కోసం గతంలో పేదలు పోరాడితే కాంగ్రేస్ ప్రభుత్వం అనేక మందిపై తప్పుడు కేసులు పెట్టింది. 3500 మందిని జైళ్ళకు పంపింది. చివరకు ముదిగొండలో 7 గురిని కాల్చిచంపింది. అయినా పేదలు వెనక్కి తగ్గకుండా పోరాడితే స్థలమేమి ఖర్మ పేదలకు పక్కాగృహాలు నిర్మించి ఇస్తామని చెప్పిన కాంగ్రేస్ ప్రభుత్వం పేదలకు ఎక్కడా స్థలాలు ఇవ్వలేదు. పైగా పట్టణాలు, మండలాల చుట్టూ 5 కిలోమీటర్ల దూరంలో ఎవ్వరికి ఇంటి స్థలం ఇవ్వకూడదని జీఓ చేసింది. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు మేము అధికారంలోకి వస్తే ప్రతిపేద కుటుంబానికి స్థలం ఇచ్చి 1 లక్షా 50 వేలతో పక్కాగృహం నిర్మిస్తామని హామీ ఇచ్చాడు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తిఅయినా ఎక్కడా పేదలకు సెంటు స్థలం ఇవ్వలేదు గాని లక్షలాది ఎకరాలు పెద్దలకైతే కట్టబెడుతున్నది. భూముల విలువ భారీగా పెంచివేసింది. మారుమూల గ్రామాలలో సైతం సెంటుభూమి లక్షల రూపాయలు పెరిగింది. పట్టణాల చుట్టూ వున్న ప్రభుత్వ భూములను భూబ్యాంకు పేరుతో ఆక్రమించుకుంటుంది. ఎక్కడ ప్రభుత్వ భూమి ఉన్నా దానిని స్వాధీనం చేసుకుంటున్నది. ఈ కారణంగా రానున్న కాలంలో పేదలకు ఇళ్ళస్థలాలు అనేది కలగానే మిగులుతుంది. బంగారం కన్నా ఇంటిస్థలాల రేట్లు పెరిగిపోయాయి. ప్రభుత్వాలు గృహ వసతి కల్పించడం వాటి సామాజిక బాధ్యతని అంతర్జాతీయంగానే ఆమోదించిన సూత్రం. ప్రభుత్వాలు ఇవ్వకపోతే పోరాడి సాధించుకోవాలి.

**మొండిగోడలతో వెక్కిరిస్తున్న పక్కాగృహాలు:** ఈ రాష్ట్రంలో గుడిశలేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని కాంగ్రేస్ ప్రభుత్వం చెపితే ఇళ్ళులేని ప్రతిపేద కుటుంబానికి 1 లక్ష 50 వేల రూపాయలతో పక్కా ఇళ్ళు నిర్మించి ఇస్తామని చంద్రబాబు చెప్పారు. వీరిద్దరి మాటలు నమ్మిన పేదలు ఉన్న గుడిశెలను తీసేసుకొన్నారు, పక్కాగృహం పూర్తికాక పేదలు రోడ్లుపైన, ప్లాస్టిక్ కవర్లు చాటున కాపురం ఉంటున్నారు. ఇందిరమ్మ ఇళ్ళ పేరుతో నిజాయితీగా పూర్తిగానూ, పాక్షికంగాను ఇళ్ళ నిర్మించుకొన్నవారికి ఇప్పటికీ బిల్లులివ్వలేదు. అప్పుచేసి కట్టుకున్న పేదలు అప్పుల బాధలు భరించలేక ఉన్న ఇళ్ళను అమ్ముకుంటున్నారు. రాష్ట్రంలో 27 లక్షల ఇళ్ళు పూర్తి చేశామని గతప్రభుత్వం చెప్పింది. ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారు, పలుకుబడి కలిగిన వారు. కొంతమంది పశువుల కోసం, గోదాముల నిర్మాణంకోసం, షాపింగ్ కాంప్లెక్స్‌ల కోసం, కోళ్ళ ఫారాలకోసం నిర్మించుకున్నవి గణనీయంగానే ఉన్నారు.అధికార పార్టీ నాయకులు కొందరు ఇళ్ళు నిర్మించకుండానే బిల్లులు పొందారు. పేదలకు మాత్రం మొండి చెయ్యిమిగిలింది. నేటి తెలుగుదేశం ప్రభుత్వం మా కార్యకర్తలకే ఇళ్ళు ఇస్తామని బహిరంగంగానే ప్రకటించింది. ప్రభుత్వాల మాటలు నమ్మి ఇళ్లు ప్రారంభించి వివిధ దశలలో ఆగిపోయి, బిల్లులు కోసం ఎదురు చూస్తున్న వారు 5,30,348 మంది ఉన్నారు. బేస్‌మెంట్ వేసుకున్నవారు 3,40,945 మంది, లెంటల్ లెవెల్ వరకు పూర్తి చేసుకున్నవారు 42,255 మంది, పైకప్పు పూర్తి చేసుకున్న వారు 1,47,148 మంది ఉన్నారు. వీరంతా ఆర్థికంగా వెనుకబడిన దళిత, గిరిజన, బలహీన వర్గాలకు చెందిన వారే. ఈ ఇళ్లన్నీ పూర్తి కావాలంటే తక్షణమే 3,941 కోట్ల రూపాయలు కావాలి. కాని గత రెండు బడ్జెట్‌లలో ఇళ్ళ నిర్మాణం కోసం, పాతబకాయిలు చెల్లించడంకోసం కేవలం 800 కోట్లు మాత్రమే కేటాయించినా నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఈ కారణంగా లక్షలాది పేదల ఇళ్ళు మధ్యలోనే ఆగిపోయాయి. పాత ఇళ్ళ పరిస్థితి ఇలావుంటే కొత్త ఇళ్ళు మంజూరు ఊసేలేదు. నిర్మాణ వ్యయం లక్ష రూపాయలు పెంచామని బాబు గొప్పలు చెబుతున్నారు. ఈ డబ్బులు పునాది వేయడానికే సరిపోతుంది.సిమెంట్, స్టీలు, ఇసుక, ఇటుకుల ధరలు భారీగా పెరిగాయి. ఈ లెక్కన పేదల ఇళ్ళు పూర్తి కావాలంటే కనీసం 2 లక్షల 50 వేల రూపాయలు అవసరం. మరోప్రక్క ఇంటి స్థలం లేక పక్కా గృహం మంజూరు కాక రచ్చబండ, జన్మభూమిలో ధరఖాస్తు చేసుకున్న వారు 14 లక్షల మంది వున్నారు.

ప్రభుత్వం సప్లైచేసే సిమెంటు, స్టీలు పూర్తిగా ఆగిపోయింది. రాష్ట్రంలో ఉన్న సిమెంటు కంపెనీలు తాము ఉత్పత్తి చేసే దానిలో 12 % ప్రభుత్వానికి సప్లై చేయాలన్న నిబంధనను సిమెంటు కంపెనీలు తుంగలోకి తొక్కాయి. ఈ కారణంగా ప్రభుత్వం ద్వారా పేదలకు సిమెంటు సప్లై గాక 250 రూపాయల బస్తాను బహిరంగ మార్కెట్‌లో 300-400 రూపాయల వరకు పేదలు కొనుక్కోవాల్సి వస్తోంది. ఇది మరింత భారంగా తయారైంది. పారదర్శకత అని గొప్పలు చెప్పుకునే నేటి చంద్రబాబు ప్రభుత్వం ఈ సిమెంటు కంపెనీలను పల్లెత్తు మాటకూడా అనడంలేదు. ప్రతి ఇంటి నిర్మాణానికి పూర్తిఅయిన వివిధ దశలను బట్టి 7 నుండి 10 రోజుల లోపు బిల్లులు మంజూరు చేయాలని ఆదేశించినా అవి కాగితాలకే పరిమితం అయ్యాయి.

గతంలో ఇళ్ళ నిర్మాణ బాధ్యతలు చూడటానికి ఉన్న ముగ్గురు వర్క్‌ఇన్‌స్పెక్టర్‌లను, బిల్లులు మంజూరు చేసే మండల సూపర్‌వైజర్‌లను తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఊడబెరికింది. నియోజకవర్గ డి.ఇ నే మొత్తం పర్యవేక్షించాలి. ఈ కారణంగా కూడా ఇళ్ళ నిర్మాణంలో పూర్తి జాప్యం జరుగుతోంది. సిబ్బంది కొరతను తీర్చకుండా ఇళ్ళనిర్మాణం సాధ్యంకాదు.

కాబట్టి పేదల సొంత ఇంటి కల నెరవేరాలంటే చంద్రబాబు ప్రభుత్వం ఒట్టిమాటలు కట్టబెట్టి నిర్ధిష్ట చర్యలు తీసుకోవాలి. తక్షణం పేదల ఇళ్ళ బకాయిలు విడుదల చేయాలి. నిర్వహణ వ్యయం 2 లక్షల 50 వేలకు పెంచి అందుకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. సిబ్బందిని పెంచి నిర్మాణాలు సకాలంలో జరిగే బాధ్యత చూడాలి. పథకంలో అవినీతి జరిగిందనే పేరుతో గతంలో నిర్మించుకున్న ఇళ్ళు రద్దు చేస్తామనడం సరికాదు. నిబంధనలు ఉల్లంఘించిన సిమెంటు, స్టీల్ కంపెనీలపై చర్యలు తీసుకొని ప్రభుత్వరేటుకు సిమెంటు అందించాలి. పేదలకు ఇళ్ళ స్థలాలిచ్చి ఇళ్ళు నిర్మించకుండా స్మార్ట్ సిటీలు, సింగపూర్ తరహా నిర్మాణం సాధ్యమా చంద్రబాబు?

**ఆహారభద్రత:** ఆహారభద్రతా చట్టాన్ని బి.జె.పి ప్రభుత్వం అటకెక్కించింది. తక్కువ రేటుకే ఆహారధాన్యాలను అందిస్తాం,100 రోజులకే ధరలు తగ్గిస్తామని చెప్పి గద్దెనెక్కిన మోడీ ఆహార సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి, పేదలకు తక్కువ ధరలకే

ఆహారధాన్యాలు అందించి, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం కోసం 1964 లో ప్రవేశ పెట్టిన ఎఫ్.సి.ఐ (భారత ఆహార సంస్థ) ను రద్దు చేయడానికి బి.జె.పి పూనుకుంది. పేదలకిస్తున్న సబ్సిడీలపై భారీగా కోత పెట్టి 40 శాతం మందికి మాత్రమే సబ్సిడీ రేట్లకు ఆహార ధాన్యాలను అందించడానికి కుట్ర చేస్తోంది. ఇప్పటికే దేశంలో 50 కోట్ల మంది పేదలు మూడుపూటల తిండిలేక అలమటిస్తున్నారు. 70% మంది పేదలు తక్కువ ఆదాయంతో బతుకుతున్నారు. సరైన పౌష్టికాహారం లేక 70% మహిళలు రక్తహీనతతో, 50% పిల్లలు సరైన ఆహారం అందక అనేక రకాల జబ్బులతో జీవిస్తున్నారని అనేక సర్వేలు చెబుతున్నాయి. మరోపక్క బహిరంగ మార్కెట్‌పై ప్రభుత్వ అదుపు లేక నిత్యావసర వస్తువుల ధరలు రెట్టింపు అయ్యాయి. సామాన్య పేదలు కొనలేని స్థాయికి పెరిగాయి. ఈ సమయంలో ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి తక్కువ ధరలకు ఆహారధాన్యాలు అందించాల్సిన ప్రభుత్వాలు నిర్వీర్యం చేయ పూనుకున్నాయి. ఎన్నికల ముందు 14 రకాల సరుకులు ప్రజాపంపిణీ ద్వారా అందిస్తామని చెప్పిన చంద్రబాబు బియ్యం తప్ప ఏమి ఇవ్వడం లేదు. పండుగల సందర్భంగా చంద్రన్న కానుకని పుచ్చిపోయిన కందిపప్పు, కారం, ఇచ్చి ప్రజలను మోసం చేశారు. రాష్ట్రంలో కొత్తగా పెళ్ళిళ్ళు అయ్యి రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదలు 12 లక్షల మంది వున్నారని ప్రభుత్వమే చెప్పింది. రోజు, రోజుకూ పెరుగుతున్న పేదరికం అదుపులేని ధరలు వల్ల అవస్థలు పడుతున్న పేదలకు ప్రజాపంపిణీ వ్యవస్థే ఆధారం. దీనిని కూడా నగదు బదిలీ పేరుతో ఎత్తివేయాలని బి.జె.పి, తెలుగుదేశం ప్రభుత్వాలు పూనుకొన్నాయి. దీనిని అంగీకరించ రాదు. ఆహార భద్రతకోసం పోరాడాలి.

**మంచినీళ్ళు నిల్, బ్రాంది ఫుల్** : రాష్ట్రంలో 50 శాతం మంది సురక్షితమైన మంచినీరు లేక అనేక జబ్బులకు గురౌతున్నారు. మన రాష్ట్రంలో నేటికీ 18 శాతం దళిత వాడలకు మంచినీటి సౌకర్యం లేదు. ఒకనాడు నగరాలకు పరిమితమైన నీళ్ళ వ్యాపారం మారుమూల పల్లెలకు విస్తరించింది. వ్యాపారం ద్వారా వేలకోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ఏ గ్రామంలో చూసినా మంచినీళ్ళు దొరుకుతాయో లేదో గానీ బ్రాందీ మాత్రం ఏ సందులో చూసినా విచ్చలవిడిగా దొరుకుతుంది. నీళ్ళ వ్యాపారం చేసుకొనే వారికి, బ్రాంది తయారు చేయడానికి కోకోకోలా, పెప్సీలు తయారు చేయడానికి ప్రభుత్వాలు నీళ్ళు అందిస్తున్నాయి. గాని పేదల దాహార్తి తీర్చడానికి మాత్రం గుక్కెడు

నీళ్ళు అందించడంలేదు. కాంట్రాక్టర్లను, రాజకీయ నాయకులను పోషించడానికి వేల కోట్ల రూపాయలు ప్రాజెక్టులకు ఖర్చు పెడుతుంది. ఎక్కడా పూర్తి అయినవీ లేదు. నీళ్ళు అందించినదీ లేదు. ఇప్పటికే రాష్ట్రంలో తీవ్రమైన కరువు నెలకొనివుంది. రాయలసీమ జిల్లాల్లో 1000అడుగులలోతు బోర్లు వేసినా నీళ్ళు రావడంలేదు.ప్రజలు డబ్బులు పెట్టి ట్యాంకర్లు ద్వారా తెప్పించుకుంటున్నారు. పేదలకు గుక్కెడు నీళ్ళు ఇవ్వని ప్రభుత్వం రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర చేయగలదా?

రాష్ట్రంలో కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన వాటర్ ట్యాంక్‌లు, పైప్‌లైన్లు పగిలిపోయి నీళ్ళ ట్యాంకులు నీళ్ళు వృధాగా పోతున్నా నివారించే సిబ్బంది లేరు. ఏఊర్లో చూసినా నీరుసరఫరా కాక దిష్టిబొమ్మల్లాగా వున్నాయి. వీటిని పర్యవేక్షించడానికి కేటాయించిన నిధులను ఖర్చు చేయకుండా అధికార పార్టీ నాయకులు, కాంట్రాక్టర్‌లు బొక్కేస్తున్నారు. మంచినీటి సరఫరా ఉన్న చోట కూడా విద్యుత్‌లేక నీటిసరఫరా ఆగిపోతున్నది.ఎపుడు నీళ్ళు వదులుతారో తెలియదు. పేదలు తమ పనిమానుకొని ఇంటి కొక్కరు నీళ్ళ కోసం కాపలా కాయాల్సిన దుస్థితి రాష్ట్రంలో ఉంది. కాబట్టి ఒక రోజు అన్నం తినకపోయినా మనిషి బతకగలడు కాని ఒక్కరోజు మంచినీళ్ళు త్రాగకపోతే బతకలేడు. అన్నింటికంటే నీళ్ళే ప్రాణాధారం. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన ఎన్.టి.ఆర్. సుజల స్రవంతి నిధులు లేక అటకెక్కింది. శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారం యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మధ్యలో ఆగిపోయిన సమ్మర్ ట్యాంక్‌లు, ఓవర్‌హెడ్ ట్యాంకులను పూర్తి చేయాలి. మంచినీటికి ప్రభుత్వం 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయాలి. తగినంత సిబ్బందిని కేటాయించాలి. అపుడే పేదలకు గుక్కెడు నీళ్ళు అందించడం సాధ్యపడుతుంది.

❖ ❖ ❖

# డిమాండ్స్

(1) ఉపాధిహామీ చట్టాన్ని ఎటువంటి అవినీతి లేకుండా అమలు చేయాలి. ప్రతి కుటుంబానికి 200రోజులు పని - రోజుకి రూ.300లు వేతనం ఇవ్వాలి. ఏడాదికి కేంద్రం 80 వేలకోట్లు కేటాయించాలి.

(2) పారిశ్రామికాభివృద్ధి పేరుతో పేదలు సాగుచేస్తున్న ఎస్సైన్డ్ మరియు డీ పట్టా భూములను లాక్కొరాదు.

(3) కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను అమలుచేయాలి. ప్రతి కుటుంబానికి 2 ఎకరాలు భూమి పంచాలి.

(4) భూసీలింగ్, ఎసైన్డ్‌మెంట్, కౌలుదారీ అటవీ హక్కుల చట్టాల్ని ఖచ్చితంగా అమలు చేయాలి.

(5) కేంద్ర భూఆర్డినెన్స్‌ను రద్దుచేయాలి.

(6) పరిశ్రమలకోసం తీసుకున్న భూములలో పరిశ్రమలు స్థాపించకపోయినట్లయితే ఆభూములను తిరిగి అసలు అబ్దిదారులకివ్వాలి.

(7) పేదల సాగులో వున్న అన్ని రకాల భూములకు హక్కులు కల్పించాలి.

(8) ఇండ్ల స్థలాలు లేని ప్రతి కుటుంబానికి 3సెంట్ల స్థలం ఇవ్వాలి.

(9) పక్కా గృహనిర్మాణంలో మంజూరైన ఇళ్ళను వెంటనే పూర్తిచేయాలి. గృహనిర్మాణ వ్యయం రూ.2.50 లక్షలు పెంచాలి.

(10) పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి.

(11) ఆహార భద్రతా చట్టాన్ని తక్షణమే అమలుచేయాలి. ప్రజాపంపిణీ ద్వారా 14రకాల నిత్యావసర వస్తువులు అందించాలి. నగదు బదిలీని రద్దు చేయాలి.

(12) నిర్భంధ ప్రాథమిక విద్యను, అందరికీ వైద్యాన్ని అందించాలి.

(13) పేదల జీవితాలను నాశనం చేస్తున్న మద్యం అమ్మకాలను అరికట్టాలి.

(14) డ్వాక్రా రుణాలు రద్దుచేయాలి.

(15) వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.1500లు ఫించన్ ఇవ్వాలి.

(16) కనీస వేతన చట్టాన్ని సమర్థవంతంగా అమలుచేయాలి.

(17) వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వమే ఇన్స్యూరెన్స్ చేయాలి. ప్రమాదాల్లో చనిపోయినవారికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.

***

వెల రూ. 3/-

సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, 27-13-3, ఆకుల వారి వీధి, గవర్నర్‌పేట విజయవాడ - 2
ఫోన్ నెం. 0866 - 2577202, ప్రచురణ కర్త: పి.మధు, రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ(ఎం) పార్టీ, ఆంధ్రప్రదేశ్